# తప్పులేని తమ్ముడు

పణతుల రామచంద్రయ్య



మామూలు ప్రకారం తనతో కలిసి యింటి గడపదాకా వచ్చిన తోటి ఉపాధ్యాయు లందరినీ కాంపౌండు గేటు దగ్గరే సాగనంపి యింట్లోకి వచ్చాడు గోపాలరావు. అలా ఆయన వెంట వచ్చిన ఉపాధ్యాయుల్లో చాలమంది కుర్రవాళ్ళు; కొత్తగా బి. ఇడి. ప్యాసై ఉద్యోగంలో చేరినవాళ్ళు. వాళ్ళందరికీ ఆయనపట్ల ఓ ప్రత్యేకమైన అభిమానమూ, గౌరవమూ వున్నాయి.

గోపాలరావు హైస్కూలు హెడ్మాస్టరు. పేరుకు హెడ్మాస్టరేగాని, మనిషిలో

ఆ డాబూ, దర్పం ఎక్కడా కనిపించవు. అంచేతనేగావల్ను, కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చినవాళ్ళు ప్రప్రథమంగా గోపాలరావు కిందనే పనిచెయ్యాలని ఉబలాటపడతారు. ఆయన తనకన్నా వయసులో చిన్నవాళ్ళయిన టీచర్లను, దగ్గర కూచోబెట్టుకుని ఏ పని ఎలా చెయ్యాలో ఆప్యాయంగా వివరించి చెబుతాడు. వాత్సల్యం ప్రదర్శిస్తూ కష్ట సుఖాలు అడిగి తెలుసుకుంటాడు.

ఆ సాయంత్రం వాళ్ళంతా ఆయనతో బాటు గృహప్రాంగణం దాకా వచ్చి, "మరి వెళ్ళొస్తాం మేష్టారూ!'' అని చెప్పి వెళ్ళిపోయారు. రోజూ అలా వెళ్ళరు. ఎప్పుడో అరుదుగా తప్ప. మామూలుగా, వాళ్ళలా అనగానే ఆయన చిరుకోపం ప్రదర్శిస్తూ, "వెళ్ళవచ్చు లేవయ్యా! ఇల్లంటే మహా వాచిపోతున్నారు మరీనీ...రండి రండి. మీతో రహస్యం మాట్లాడాలి,'' అంటాడు. ఆయన పరిభాషలో 'రహస్యం' అంటే 'కాఫీ' అని వాళ్ళకు తెలుసు. సరే. ఆయన అలా అన్నాక, వాళ్ళంతా ఇంట్లోకి వచ్చి, కాఫీ తాగి, కాసేపు పిచ్చాపాటీ మాట్లాడి వెడతారు.

కాని ఈరోజు మాత్రం ఏ తొందరలో వున్నాడో, ఆయన అలా అనలేదు. ఇంట్లోకి వచ్చి, బరువుగా వాలుకుర్చీలో కూచున్నాడు.

ఇంతలో లోపల్నుంచి ఆయన భార్య లక్ష్మి వచ్చింది. ఆమె ఆయన కోటు విప్పుతూ, "అలా కూచున్నారేం! లేచి వెళ్ళి మొహం కడుక్కోండి. ఈలోగా కాఫీ పట్టుకొస్తాను." అంది.

ఇదే రోజువారీగా అయితే, ఆయన నవ్వుతూ లేచి "దేవిగారి ఆజ్ఞ" అంటూ వెళ్ళేవాడు. కాని యీ రోజు అలా అనలేదు. నిర్లిప్తంగా వెళ్ళి మొహం కడుక్కుని వచ్చి కూచున్నాడు. ఆమె అందించిన కాఫీ యాంత్రికంగా తాగేశాడు.

"అలా వున్నారేం, యివాళ?"

"ఏం లేదు...''

జీవితంలో ఎదురుపడే మధుర విషాదానుభవాలను ఒకేవిధంగా స్వీకరించగల సంస్కారవంతుడు ఆయన. అలాంటిది ఈరోజు ఆయన వదనంలో ఏవో బాధల మబ్బులు ఆవరించి వుండటని చూచి మథనపడింది లక్ష్మి. ఆమె ఉన్నట్టుండి ఏదో తోచినట్టు పక్క గదిలోకి వెళ్ళి అమృతాంజనం డబ్బీ పట్టుకొచ్చింది. అది చూచి నవ్వాడు గోపాలరావు.

పక్కనే వున్న మరో కుర్చీని ఆయనకు దగ్గరగా వేసుకూర్చుని, ఆయన నుదురుకు అమృతాంజనం పట్టించే ప్రయత్నంలో వున్న లక్ష్మిని చూచి, ఓ అర్థం లేని నవ్వు నవ్వుతూ, "నువ్వు చేసేపని చూస్తుంటే పిడుక్కూ బియ్యానికీ ఒక్కటే మంత్రం అన్నట్టుగా వుంది లక్ష్మీ!''

అన్నా డాయన. తిరిగి ఆమెవద్దనుంచి సమాధానం కోసం ఎదురు చూడకుండానే "మానసిక రుగ్మతలకు శారీరక చికిత్సలు పని చేస్తాయా లక్ష్మీ ?'' అన్నాడు.

లక్ష్మి విస్తుపోయింది. ఆమె కేమీ అర్థం కాలేదు.

"ఏమిటో చెప్పండి." అంది.

ఆయన ఏమీ జవాబు చెప్ప లేదు. ఆయన మొహం వివర్ణంగా వుంది ఏదో చెప్పటానికి ప్రయత్నిస్తూ తనలోతాను సంఘర్షణ పడుతున్నా డాయన. లక్ష్మికిది దుర్భరంగా వుంది.

"మిమ్మల్ని ఎంతో అర్థం చేసుకున్నా ననుకున్నాను. కాని అదంతా భ్రమే నని పిస్తోందిప్పుడు...ఏమండీ ! మీ కష్టసుఖా లను మీతోబాటు పంచుకునే హక్కు నాకు లేదనే అనుకుంటున్నారా మీరు ?" అంది ఆమె.

''అబ్బ ! నన్ను వేధించకు లక్ష్మీ ! నేనిప్పుడేమీ చెప్పే పరిస్థితిలో లేను..." అన్నాడాయన. కాని చికాకుతో కాదు. దైన్యం ఆయన ముఖమంతా కమ్ముకుం టోంది. మరో నిముషంలో ఆయన కళ్ళ నిండా నీళ్ళు నిండాయి.

ఆయన యిలా కన్నీళ్ళు నించటం ఆమెను విచలితను చేసింది. రోజూ ఆయన హైస్కూలునుంచి వచ్చినప్పుడు జరిగే ఆనంద సన్నివేశం యీ నాడు మృగ్యమైపోగా, ఈ హఠాత్పరిణామా నికి ఏరకంగానూ సమాధానపడ లేక పోతోంది ఆమె.

ఆమె అలా నిర్విణ్ణురాలై వుండటం చూసి, "కోపం వచ్చిందా లక్ష్మీ?" అన్నా డాయన.

''కోపం దేనికి ?''

"ఏమిటో, అంతా నీకు చెప్పాలను కున్నా చెప్పలేక పోతున్నానులక్ష్మీ ! నామనస్సే నాస్వాధీనం తప్పుతోంది. ఏదో ఒక అతీతశక్తి నా కెదురుగా నిల్చుని, నేనుచేసిన అన్యాయానికి నిష్కృతిలేదని చెబుతున్నట్టుంది...ఏం చెయ్యను ?''

లక్ష్మి ఆశ్చర్య పోయింది మళ్ళీ. "మీకు పిచ్చెక్కుతోంది. లేకపోతే, మీరు అన్యాయం చెయ్యటమేమిటి ?... మీరు ఎవ్వరికీ అన్యాయం చెయ్యరు. ఆ మాత్రంనాకు తెలుసు.'' అంది.

"అలా అనుకోవటం పొరబాటులక్ష్మీ! ప్రపంచంలో ఎవ్వరికీ అన్యాయం చెయ్య రని మనం అనుకునే వ్యక్తులే ఒక్కొక్క సారి దారుణమైని అన్యాయాలు చేస్తారు. ఒక్కొక్కసారి మనకు తెలీకుండానే మనం కొందరికి అన్యాయంచేస్తాం...కాని నా విషయంలో జరిగింది అలాంటిది కాదు. తెలిసే అన్యాయం చేసానునేను."

"అన్యాయమా ??'' లక్ష్మి తనలోతనే అవిశ్వాసం ప్రదర్శించు కుంటోంది. మంచితనానికి మారుపేరు తనభర్త -

ఇలాంటి సహృదయిలు కూడా జీవితంలో అన్యాయం చెయ్యగాలరా ? ఇది అగమ్యంగా వుంది ఆమెకు.

గోపాలరావు జేబులోంచి కవరొకటి తీసి లక్ష్మిచేతిలో పెట్టాడు.

లక్ష్మిచేతులు వణుకుతున్నయ్. ఏదైనా భగ్నప్రణయ వృత్తాంతమా ఇది? ఇన్నాళ్ళుగా మధుర మనోజ్ఞ స్వప్నంగా, నిత్య మోహనగీతంగా సాగింది తమ వైవాహికజీవితం, ఇప్పుడిదేమిటి ?

ఉత్తరం విప్పి చదివింది :

"అన్నయ్యా !

ఇలాపిలిచే హక్కైనా నువ్వు ఈ తమ్ముడికి ఇస్తావోలేదో తెలీదు. బహుశా చిన్నప్పటిలాగానే కోప్పడి, కొట్టటానికి ప్రయత్నించి, ఉత్తరాన్నే చించివేస్తావేమో ! ఒకవేళ అంతటితో కోపంతీరక నన్ను వెదుక్కుంటూవస్తే, నువ్వు వచ్చేటప్పటికి నేను ప్రపంచంలో ఉంటాననేది అనుమానంగా వుంది.

"చిన్నప్పటి నా రూపాన్ని బట్టి ఇప్పటినన్ను ఊహించుకుంటావేమో నువ్వు. ఊహించుకుంటే ఫరవాలేదుగాని. నారూపంతోబాటు నా జీవితాన్ని కూడా వూహించుకోకు. నాది భ్రష్టమైన జీవితం. అందులో నక్కల అరుపులేతప్ప, దివ్య సంగీతం ఎన్నడూ వినిపించలేదు. ఎన్ని జన్మాలకర్మసంచితమో ఇది ! నా జీవితం నేనే భ్రష్టంచేసుకున్నాను. కాని ఇందుకునన్ను ఎవ్వరూ తప్పుపట్టలేరు. మంచిదారిలో ఎందుకు నడవలేదని ఎవ్వరేనా నన్ను ప్రశ్నిస్తే, అలా నడిచేందుకు నాకు అవకాశం ఎవరిచ్చారని ఎదురుప్రశ్న వేస్తాను...ఇది అబద్ధమా అన్నయ్యా ? చిన్నతనంనుంచీ నాకు ఎవ్వరూ, చివరకు రక్తబంధువులు కూడా, ప్రేమానురాగాలు పంచిపెట్టలేదు. ఛీత్కరించారు. అసహ్యించుకున్నారు. కసిరికొట్టారు. ఈ విశాలవిశ్వంలో నన్నూ జీవించమని భగవంతుడు నాకూ ఒక జీవితాన్ని కేటాయిస్తే, దాన్ని ఒక పనికిమాలిన వస్తువుగా తోసివేశారు, నావాళ్ళూ, తోటిమానవులూ.

"అందరూ అలా ప్రవర్తించటంచూసి నాకుకూడా నా జీవితంవిలువ లేనిదేమోననిపించసాగింది. ఇంత విలువలేనప్పుడు దీనితో ఎలావ్యవహరిస్తే నేమనిపించింది. దాన్ని ఎలాపడితే అలా వాడుకున్నాను. ముళ్ళపొదల్లోంచీ, బురదవాగుల్లోంచీ లాగాను. అలా చేసేటప్పుడు ఎవరిమీదో పగతీర్చుకుంటున్నట్టు భావించాను. ఏం చెయ్యను ? నాకు మరోదారిలేదు. దారులన్నిటినీ నావాళ్ళు మూసివేశారు. చీమూ నెత్తురూవున్న మానవప్రాణిని; జీవితాన్ని ఓ అపురూపశిల్పగా మలచుకోవాలని నాకు కోరిక లేకపోలేదు. కాని అలా మలచుకున్నప్పుడు తనవాళ్ళూ, తోటి



"బ్రతికినంతకాలం వేధించావు, చచ్చినాకకూడా వదలవా ఏమిటి?"

వాళ్ళు దాన్ని గుర్తించాలని మానవుడు కోరుకుంటాడు. నా విషయంలో ఆ గుర్తింపు కరవైంది. ఇక ఎలా మలచుకుంటేనేం? ఎవరికి కావాలి నాజీవితం?

"చిన్నతనమంతా ఎప్పుడూ పది మాటల కొక్కసారైనా జవాబుచెప్పలేని వాణ్ణి ఇప్పుడిలా రాస్తున్నందుకు మన్నిస్తావని ప్రాధేయ పడుతున్నాను. నా జీవితమంతా ఒక బలవంతపు మౌన ముద్ర. ఈ ముద్రే ప్రపంచంలో నా తరఫున వాదించుకోవటానికి కూడా నన్ను అసమర్థుణ్ని చేసింది. ఇప్పుడు ఆలా వాదించుకోవాలన్న తాపత్రయం కూడా లేదు. గమ్యంలేకుండా పారే నీటి వాగులాగా నానా మార్గాల్లో నడిచి, తత్ఫలితంగా త్వరగా జీవన చరమ సంధ్యను చేరుకుని, యిప్పుడు చీకటి వెలుగుల్లో నా అనుభవాలను విమర్శించుకుంటున్నానునేను. అసమర్థంగా, అసంబద్ధంగా గడిచిన యీ జీవయాత్రను ఇక త్వరలోనే ముగించబోతున్నాను. తమ్ముడుగానేను ఇంతవరకూ నిన్ను ఎప్పుడూ ఎలాంటికోరికా కోరివుండలేదు. ఇప్పుడుమాత్రం ఒక్కటి కోరుతున్నాను. నాకు సానుభూతి అక్కరలేదు. ఆత్మీయతాజనితమైన ఒక్క కన్నీటిబొట్టు కావాలి. ఇస్తావా అన్నయ్యా?

"నేనెక్కడవున్నదీ, నా అడ్రసూ పక్కన ఇస్తున్నాను. ఇది ఎందుకంటావా, ఏందుకో నాకేతెలీదు. ఒకవేళ

దయకలిగి నా చితాభస్మంమీద కన్నీళ్ళు కార్చేందుకు నువ్వు రావటానికిగాని, మరెందుకేనాగాని ఇది పనికిరావచ్చు. అన్నిరకాల అనుభవాలనూ పోగుచేసుకుని ఆరు నెలలకిందట నేను యీ వూరికి చేరుకున్నాను. ఈ వూరునీకు సమీపమే అయినా, నాగురించి నీచెవికి ఏమీ సోకకుండా జాగ్రత్తపడుతూ వచ్చాను. నీ హోదా, గౌరవమూ గొప్పవి. అలాంటిది, నాలాంటి భ్రష్టుడు నీకుతమ్ముడని తెలిస్తే, అది నలుగడలా ప్రాకి నీ గౌరవానికి భంగం కలిగిస్తుందన్న భయంతో అలా చెయ్యవలసి వచ్చింది.

"వదినెగారు కులాసాగా వున్నారా? ఆవిడకు నా నమస్కారాలని చెప్పు. ఆవిణ్ణినేను చూశాను. ఆశ్చర్యంగా వుందా? నీ పెళ్ళికినేనూ వచ్చాను. దొంగలాగావచ్చి, పెళ్ళిపీటలమీద నిన్నూ వదినెనూ చూసి మళ్ళీ పట్టుబడతానేమోనన్నభయంతో వెంటనే వచ్చేశాను. పెళ్ళిసంబరాల్లో నువ్వుగాని, మరెవ్వరుగాని నన్ను గుర్తుపట్టలేదు.

"ఇక్కడకు వచ్చినప్పట్నుంచీ నేను నిన్నుగురించి వింటూనే వున్నాను. హెడ్మాస్టరుగా నీ కీర్తి దిగంత విశ్రాంతంగా వుంది. నువ్వు ఆదర్శమైన ఉపాధ్యాయుడి వనీ, అమృత హృదయుడి వనీ, దివ్య సంస్కారి వనీ వాళ్లు చెబుతుంటే విని నేను మహానందం అనుభవించాను. ఇంత మంచివాడివి నీ హృదయంలోని అమృతాన్ని నాకూ నా చిన్నతనంలో రవ్వంత పంచియివ్వలేక పోయావంటే, అది నా దురదృష్టమేమో! ఏ దుర్ముహూర్తాన మనం ముఖాముఖీ చూచుకున్నామో — అనిపిస్తోంది.

"ఇంకేం వ్రాయను? ఒకసారి ఇక్కడికి వచ్చి పోవలసిందిగా నిన్ను కోరటం నాకు సాహసోపేతమైన పని; ఇష్టంలేంది కాదు.

నీకు నమస్కారాలు. తమ్ముడు,
వాసు."

ఉత్తరం పూర్తిచేసేసరికి లక్ష్మికికూడా కన్నీళ్ళు ఆగలేదు. ఎవరీతడు; ఇన్నినాళ్ళూ అజ్ఞాతవాసంలో వున్న యీ మరిది ఎవరు? ప్రాణప్రదంగా చూచుకుంటున్న తనదగ్గరే యీ విషయాన్ని దాచిపెట్టాడా తన భర్త? ఈయన కొక తమ్ముడున్నాడన్న విషయమే ఇందాకా తనకు తెలియదు!

ఒకనాడు జరిగిన సంఘటన ఆమె మనసులో మెదిలింది. ఆరోజు ఎదురింటి వాళ్ళబ్బాయి లిద్దర్నీ కాఫీకి ఆహ్వానించారీయన. ఆ అన్నదమ్ము లిద్దరూ పట్నంలో చదువుతున్నారు; ఇద్దరూ ఎంతేనా అన్యోన్యంగా వున్నారు. వాళ్ళు వచ్చి, కాఫీ తాగి పిచ్చాపాటీ మాట్లాడి వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళిపోతోంటే వాళ్ళవేపు దీనంగా చూస్తూ కంటతడి

పెట్టుకుంటున్నా రీయన. తనకు ఆశ్చర్యం వేసింది.

"ఎందుకు కన్నీళ్ళు ?'' అని తను అడిగితే, ''అన్నదమ్ము లిద్దరూ అలా రక్తబంధాలను గాఢంగా ముడివేసుకుని మెలగటం పూర్వజన్మ సుకృతం లక్ష్మీ ! అడ్డమైన దౌర్భాగ్యు లందరికీ ఆ అదృష్టం పట్టుతుందా ?'' అన్నారు. తను విస్తు పోయింది. దేవుడు ఇవ్వని అన్నదమ్ముల కోసం ఇంత ఆర్ద్రమైపోయే మనుషులు ఇంకెవరేనా వుంటారా ? అనిపించింది తనకు.

ఇప్పుడీ జాబును నేపథ్యంలో వుంచుకుని చూస్తే ఆనాటి సంఘటనకు హేతువైన వృత్తాంత మేదో దృశ్యాదృశ్యంగా కనిపిస్తోంది.

ఆమె భర్తవేపు చూసింది. కళావిహీన వదనంతో శూన్యంలోనికి చూస్తున్నాడాయన. ఇన్నాళ్ళ సాహచర్యం తనకి ఆయన హృదయగత జీవితంలో ఏ మాత్రం ప్రవేశార్హత కల్పించింది ? అన్న ప్రశ్న ఆంతర్యంలో మొలకెత్తింది. ఆమె భర్త బుజంమీద తల ఆనిస్తూ, "మనసులోని దేమిటో బయటపెట్టకుండా చుట్టుపట్ల వున్నవాళ్ళను యాతన పెట్టటం నేర్చుకుంటున్నారు మీరు.'' అంది.

''చెప్పి నిన్నుకూడా బాధపెట్టటం నా కిష్టంలేదులక్ష్మీ ! అయినా, చెప్పదగిన సమయం వచ్చినప్పుడు తప్పకుండా చెబుతాను. ఇప్పుడుమాత్రంకాదు..నాతో బాటు నా తండ్రిరక్తం పంచుకుని పుట్టిన తమ్ముడు, 'నా' అన్న వాళ్ళెవరూ లేని ఓ కుగ్రామంలో అలా మృత్యువును ఆహ్వానిస్తూ నిలబడివున్నాడు. నాకేం మనసు నిలవటంలేదు లక్ష్మీ !"

''అక్కడికి వెళ్ళాలనుకుంటున్నారా ?''

"అవును..."

"అయితే పదండి. నేనూవస్తాను. ఈ పరిస్థితిలో మీకు దూరంగావుండాలన్న వూహే నాకు భయంకరంగావుంది." అంది లక్ష్మి.

* * *

మూడు రోజులయ్యాక ఒక సాయంకాలం ఆ గ్రామంలో గోపాలరావూ, లక్ష్మీ ఓ చిన్నయింటి పంచలో కూచుని నిట్టూర్చుతున్నారు. జీవితం వర్షాకాలపు నదిలా ఎందుకు పరుగులుపెడుతుందో, ఆ వురవడిలోపడి అగమ్యంగా కొట్టుకుపోతూ మనుషులు ఆత్మీయుల కెందుకు దూరమైపోతారో నని ఆలోచిస్తున్నారు. అది గోపాలరావు తమ్ముడు వాసు చనిపోయిన మూడవ దినం.

అంతదూరం ప్రయాణించి వచ్చిన వాళ్ళిద్దరూ శవాన్నిమాత్ర చూడగలిగారు. వాళ్ళు వచ్చేసరికి అవూళ్లోవాళ్ళు దహనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కాని ముందుగా ఎవరికివారే శవాన్ని ముట్టు

కునేందుకు భయపడ్డారు. కూడని సహవాసాలవల్ల అతడిశరీరం చెడిపోయిందనీ, ముట్టుకుంటే ఆ వ్యాధులు తమకూ సోకవచ్చుననీ అన్నారు. వాళ్ళు అలా అంటీ అంటనట్టుగా వున్న సమయంలో గోపాలరావూ, లక్ష్మీ రైలుదిగి వచ్చారు. వాళ్ళ రాకతో పరిస్థితిమారింది. మృతుడు గోపాలరావు తమ్ముడని విన్న గ్రామస్తులు ఆశ్చర్యపడ్డారు. ఉపాధ్యాయుడుగా గోపాలరావు పేరు ఆ గ్రామాల్లో చాలా మందికి తెలుసు. ఏర్పాట్లన్నీ చకచకా సాగాయి; సాయంత్రానికి అంతా పూర్తయింది.

ఆరడుగుల పొడవున్న వాసుశరీరం, చితిమీద వుంచినప్పుడు కూడా అతడి మొహంలో కనిపించిన నిరామయభావం— గోపాలరావు మనసులో యింకా చెరిగిపోలేదు. వాసు ఈ లోకంలో ఏమికావాలనుకున్నాడో, ఏమి తీసుకుపోయాడో ఆయనకు తెలియదు. తనకు ఇక జీవితంలో మనశ్శాంతి దొరకదు. తన నేరానికి ఈ మనోవేదన తప్ప మరేశిక్ష లభించినా బాగుండును!

రాత్రయింది. వెన్నెల వస్తోంది. ఇంటిముందు, వెనుకా నిటారైన తాటి చెట్లు. ఆ తాటిచెట్ల మట్టల్లోంచి వెన్నెల పాయలు పాయలుగా వచ్చి గడపమీద పడుతోంది. ఆ వెన్నెల ధవళిమలో, గత స్మృతుల ప్రతిధ్వనులవల్ల గోపాలరావు కనుగొనల్లోనుంచి చిందుతోన్న కన్నీటిని లక్ష్మి గమనించకపోలేదు. కాని ఆమెకు భర్తను ఓదార్చాలన్న ధ్యాసైనా లేదు. మనుషులు పరిపూర్ణమైన విషాదంలో మునిగివున్నప్పుడు ఆ విషాదంలోంచి మధురమైన వూహలను సృష్టించుకుందామనీ, ఆ వూహలతో అనుభవాల కారు మేఘాల అంచులకు మెరుగు పెట్టుకుందామనీ ఆశిస్తారు. ఆయన ఒకవేళ అలాంటి ఆశతో వున్నప్పుడు తను కదిలించడం మంచిది కాదనుకుందేమో ఆవిడ... ఆమెదో ప్రత్యేక భావ పరంపర.

ఆయన పంచలోంచి లేచి వెళ్ళి, తన కోసం గ్రామ మునసబు పంపించిన నవారు మంచాన్ని ఆరుబయట వాల్చుకుని కూచున్నాడు. కాస్సేపాగి, "లక్ష్మీ!" అన్నాడు.

తలెత్తి చూచింది లక్ష్మి.

"మనసులోని అగ్నిజ్వాలలు ఈ వెన్నెలలో కొంచెం చల్లారుతున్నాయి లక్ష్మీ! గతించిన కథనంతా యిప్పుడు నీతో చెప్పివేసి మనస్సును మరింత తేలిక చేసుకోవటానికి ఇంతకన్నా మంచి సమయం దొరకదేమో!...వింటావా లక్ష్మీ?''

"అంతకంటేనా?...చెప్పండి." అంటూ లేచి వెళ్ళి ఆయన పక్కనే కూచుంది లక్ష్మి.

మేఘరహితమైన ఆకాశంలోంచి




"ప్రశ్న సిపాయి విప్లవంగురించి. నీవు ఫ్రెంచి విప్లవంగురించి రాశావు!"
"సార్! ప్రశ్న సిలబస్‌లో లేదు. అందుకని జవాబుకూడా అలాగే యిచ్చాను!"

---

ప్రవహించే శుభ్రజ్యోత్స్నలో ఇద్దరి మొహాలూ ఒకరొకరికి స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఆయన చెప్పసాగాడు :

"మా నాన్న స్వతహాగా మంచివాడే కాని, అప్పుడప్పుడూ విపరీతంగా మారి పోతూ వుండేవాడు. అలాంటి సమయాల్లో ఆయనలోని రాక్షసాంశ బయటికి వచ్చేది. 'రాక్షసాంశ' అన్న పదం కటువుగా వుందా? ఉన్నా ఫరవాలేదు. మనిషన్న ప్రతివాడిలోనూ కాస్తోకూస్తో రాక్షసత్వం లేకుండా పోదు...మా నాన్న ఆవేశాలు కానీ, ఆగ్రహాలు కానీ మామూలు మనుషుల్లోకన్నా ఒక పాలు ఎక్కువ బలంగా వుండేవి.

"అసలు వాసును మరిచిపోయి మా నాన్ననుగురించిచెబుతున్నందుకు ఆశ్చర్యపోకు. మా నాన్నను కూడా కలిపితే కాని వాసు కథ పూర్తికాదు. ఎందుకంటే, వాసుకు జరిగిన అన్యాయానికి మా నాన్నకుకూడా బాధ్యత వుంది.

"నాపదోయేట మా అమ్మ పోయింది. తరువాత సంవత్సరం తిరక్కుండానే నాన్న రెండో పెళ్లి చేసుకున్నాడు. పిన్ని పేరు సుగుణ. పిన్ని గుణంలో కూడా సుగుణ. ఈ సంగతి అప్పటి

స్మృతుల్నిబట్టి యిప్పుడు తెలిసివస్తోంది కాని, ఆ నాడు మాత్రం తెలీదు. చిన్న తనపు గారాబంతో, మూర్ఖంతో, పొగరుతో జళ్లు తెలీకుండా ప్రవర్తించినరోజులవి.

“అప్పటిదాకా నేనుచూసిన సినిమాలవల్లా, విన్న కథలవల్లా సవతి తల్లులు ఎలాంటివాళ్ళో నా మనసులో అప్పటికే ఒక వూహ ఏర్పడిపోయింది. ఆ వూహ ప్రకారం, సుగుణపిన్ని మా యింటికి కాపురానికి రాకముందే ఆమెనుగురించి అంచనా వేసుకున్నాను. ఆమె చాలా గయ్యాళి అయివుంటుంది. నన్ను సరిగా చూడదు. నేను వృద్ధిలోకివస్తే చూచి కంటగించుకుంటుంది. నాన్ననువల్లోవేసుకుని, ఆస్తినంతా తనకూ తనసంతానానికీ మాత్రం రాయించుకోవాలని తాపత్రయపడుతుంది......ఈ ఊహలతో నా రక్తం ఉడుకెత్తింది. ‘ఇలా జరగనివ్వకూడదు,’ అనుకున్నాను.

“ఏవేవో అర్థంకాని ఉక్రోషాలూ, ద్వేషాలూ మనసులో నిండివుండేవి. అంతచిన్న వయసులో అలాంటి వూహలుండటం మంచిది కాదంటారు. కానినేను ఆ ఊహలనే తిని బ్రతికాను. అందుచేతనే, పిన్ని వాళ్ళమ్మను వెంటబెట్టుకునివచ్చి మాయింట అడుగు పెట్టినప్పుడు నేను యింటిలో లేకుండా మొహంతప్పించి వెళ్లాను. ఆ రోజంతా భోజనానికికూడా యింటికిరాలేదు. పెళ్ళిలో నన్నుచూసింది పిన్ని. అంచేత గుర్తుపెట్టుకుని అడిగిందట నేనెక్కడికి వెళ్లానని. మర్నాడు నేను ఇంటికి వచ్చాకకూడా అడిగింది, ‘నిన్న ఎక్కడికి వెళ్ళావు గోపీ?’ అని. ఆ మాటల్లో ఆప్యాయత వుందని ఇప్పుడు తెలుస్తోంది కాని, ఆనాడది కనిపించలేదు సరికదా, అలా అడగటం అధికార పూరితంగానూ, పిన్ని అప్పుడే సవతి కొడుకైన నామీద పెత్తనం చెలాయిస్తున్నట్లుగానూ తోచింది. అహం రేగింది. ‘నాయిష్టం వచ్చినచోటికి వెళతాను. అందుకు శిక్షవేస్తావా యేమిటి’ అన్నాను.

“పిన్ని నవ్వింది. బహుశా, ‘ఇదంతా పసితనం’ అన్న భావంతోనేమో ; కాని నేను మొహంమాడ్చుకున్నాను, చీదరించుకున్నాను. అప్పుడేకాదు. పిన్ని జీవించి వున్నంతకాలం నేనామెను చీదరించుకోని క్షణంలేదు. ఆమెను గురించిచెడ్డగా మాట్లాడనిక్షణంలేదు. కాని నా చీదరింపులనూ, ఉక్రోషాలనూ చిరునవ్వు తెరలలో అదృశ్యంచేసి నాకు వాత్సల్యాన్నే పంచియిచ్చింది ఆ యిల్లాలు.

“నాన్న కోపం వచ్చినప్పుడో, సంతోషం కలిగినప్పుడో గప్పున పొంగిపోయి వెంటనే చల్లారేవాడు. తనవాళ్లను చదవటమే ఆయనకు చేతకాదు. ఇంట్లో నన్నివేళాలపట్ల ఆసక్తిలేని ప్రేక్షకుడిలా వుండిపోయేవాడు. ఎప్పుడూ అకార

ణంగా పిన్నిమీద నేను సణుక్కుంటూ వున్నా ఆయన పట్టించుకునే వాడు కాదు. ఒక్కొకసారి పిన్నినే కేక లేసే వాడు. పిన్ని అన్నిటినీ సహించింది. ఎవ్వరెన్ని మాటలన్నా, ఎన్ని ఉప్పెనలు పైకి పొర్లివచ్చినా, కులగిరుల గాంభీర్యాన్నీ హుందాతనాన్నీ ప్రదర్శించ గలిగింది. అందుకేనేమో, అంత మూర్ఖపు మనిషి నాన్నకూడా క్రమంగా పిన్నిని గౌరవించటం నేర్చుకున్నాడు ప్రేమించాడు. ఆ ప్రేమ అంతా, పిన్ని తన సుఖాన్నీ, అభిమానాన్నీ పణంగాపెట్టి సంపాదించుకున్నదే.

"పిన్ని దాంపత్య జీవితంలో రెండేళ్లు గడిచాయి. నేను పడుతూ లేస్తూ అప్పటికి సెకండుఫారంలోకి వచ్చాను. నేను హైస్కూలుకు వెళ్లేందుకు రోజూ పది గంటలలోగా వంటచేసిపెట్టేది పిన్ని. ఆప్యాయంగా దగ్గర కూచుని వడ్డించేది. నా బట్టలూ, పుస్తకాలూ సమయానికి అందించేది. పిన్నిచూపే యీ అవ్యాజ్య ప్రేమకు, ఒక్కోసారి పిన్నిపట్ల భక్తి లాంటిది, లేదా గౌరవంలాంటిది. చిన్న అలగా కదిలేది హృదయంలో. కాని దాన్ని వెంటనే అణచి వేసేవాణ్ని. నాకు వేళకువండి వడ్డించడం, సదుపాయాలన్నీ అమర్చటం ఆవిడ విధిగనుక, తప్పని సరై అవన్నీ చేస్తోందని వ్యాఖ్యానించుకునే వాణ్ని.

"నాన్న పిన్నిని ప్రేమతో చూడటం ప్రారంభించాడన్నానుగా ! ఆ ప్రేమ వృద్ధిపొందింది. ఎంతదూరం వెళ్ళిందంటే. పిన్నిని తొలికాన్పుకుకూడా పుట్టింటికి వెళ్లనివ్వలేదునాన్న. ఊళ్లోనే అన్నిసౌకర్యాలూ వున్న ఆస్పత్రిలో చేర్పించాడు. ఆసుపత్రిలో మగపిల్లవాణ్ని కని, ఆ తర్వాత రెండు రోజులకే కన్నుమూసింది పిన్ని. ఆ మగపిల్లవాడేవాసు.

"ఆసుపత్రిలోపిన్నిశవాన్ని చూశాను. పిన్ని స్వతహాగా అందమైనది. అందమైన ఆ మొహంలో, పెదాలమధ్య ఓ సన్నని చిరునవ్వు ఇంకా అణగివుంది. మృత్యువు పల్లకీ తెచ్చి స్వాగతం యిస్తుంటే చూచి సంతోషించిందేమో ! లేక, జీవితంలో మూర్ఖతను అర్థం చేసుకునేందుకు ఏ మాత్రమూ ప్రయత్నించని వాళ్ల మూర్ఖతకు నవ్వు వచ్చిందేమో ఆవిడకు ! ఆ నవ్వు పూర్తిగా నవ్వేందుకయినా పిన్నికి వ్యవధి యిచ్చినట్టు లేదు మృత్యువు ...... పిన్నిని చూచి జాలి పడ్డానుగానీ, ఆ జాలి ఆత్మీయతా జనితమయిందికాదు ; బజారులో కనబడేబిచ్చగాని మీదచూపే జాలివంటిది. అదైనా క్షణికమే. పిన్ని పక్కనే పడుకుని, అమ్మ చనిపోయిందన్న జ్ఞానమే నా లేకుండా ఆడుకుంటూ, పాలు తాగటానికి ప్రయత్నిస్తున్న చంటివాడుకూడా నాలో

మమతా బంధాలను సృష్టించలేక పోయాడు.

"పిన్ని యిలా అకస్మాత్తుగా పోతుందని ఎవ్వరూ అనుకోలేదు. ఈ దుర్ఘటన నాన్నను క్రుంగదీసింది. ఏదైనా విలువైన వస్తువు మనదగ్గర వున్నంత కాలమూ మనం దాని విలువను గుర్తించలేం. కాని ఆ వస్తువు ఒక్కసారిగా మనకు దూరంకాగానే, అది లేకపోవటంవల్ల ఏర్పడేకొరత అనుభవానికి రాగానే, ఆ వస్తువు విలువను నయాపైసలతోసహా గుర్తిస్తాం—నాన్న పిన్నిని ప్రేమించినా, గౌరవించినా, ఆమె వ్యక్తిత్వపు విలువను సరిగాగుర్తించలేదు. ఆడదిక్కులేని మా యింటికి ఆమె ఎంత అమూల్యమైనదో, ఆమె చనిపోయినతరువాత మాకు తెలిసివచ్చింది.

"అప్పటినుంచీ నాన్న యింట్లో ఏ విషయాన్నీ అంతగా పట్టించుకోవటం మానేశాడు. చంటిబిడ్డకు తూతూ మంత్రంగా నామకరణం జరిపి, 'వాసు' అని పేరుపెట్టాడు. ఒక దాదిని కుదిర్చి, వాసు పోషణను ఆమెకు అప్పజెప్పాడు. వాడిమీద నాన్నకు ఆపేక్షలేదు. పైగా, వాణ్ని కంటూనే పిన్ని చనిపోవటంవల్ల వాడిపట్ల ఆయకో వైముఖ్యంవుండేది 'పుట్టుతూనే తల్లిని పొట్టపెట్టుకున్నా'డని వాణ్ని తిట్టేవాడు. వాణ్ని ఏనాడూదగ్గరికి తీసేవాడుకాదు సరికదా వాడంతట వాడు దగ్గరకువస్తే చీదరించుకునేవాడు. 'వెధవ! అమ్మను మింగావు. నన్నూ మింగుతావా యేమిటి?' అనేవాడు. ఆ పసివెధవ ఆ మాటలకు అర్థంతెలీకనవ్వితే వాణ్ని కొట్టేవాడు. వాడు అమాయికంగా ఏడ్చేవాడు. అప్పటికి వాడికి ఇంకా సరిగా మాటలురాలేదు.

"మా యిద్దరిలో నాపైనే నాన్నకు ఆపేక్ష. నాకు అన్ని గారాబాలూ జరిగాయి. వాసుకు ఏ గారాబమూ జరగలేదు. నాన్న ఏ తినుబండారాలు తెచ్చినా, ఆటవస్తువులు తెచ్చినా వాటిల్లో పెద్ద వాటా నాది. ఒక్కొక్కసారి వాసుకు అసలే ఏమీ మిగిలేదికాదు. వాడు మా యింట్లో పుట్టినవాడుకానట్టూ, దిక్కులేక వచ్చి మా యింట్లో బ్రతుకుతున్నట్టూ చూశాము నేనూ, నాన్న. మేము అలా చూడటం గమనించి వాణ్ని యిట్లో పని మనుషులు కూడా నిర్లక్ష్యం చెయ్యటం సాగించారు. ఈ నిర్లక్ష్యంలోనే, నిరాదరణలోనే, వాడి బాల్యమంతా గడిచింది.

"అన్నదమ్ములమధ్యా, అక్కచెల్లెళ్లమధ్యా పుట్టి పెరిగి వుండకపోవటం వల్లనేమో, నాలో చిన్నప్పటినుంచీ మార్దవంలేదు. నాన్న వాసువిషయంలో కఠినంగావుండటం నాకు సంతోషంగా వుండేది. నాన్న ఆసరాచూచుకుని నేను కూడా వాణ్ని కసురుకునేవాణ్ని—వాడు నాకు తమ్ముడు. నాలో మమకారమూ,



"మరదలుకి చీరె తేపటం మర్చిపోయాడు."

ప్రేమా అనేవివుంటే వాడికి సర్వదా అర్హుడైనవాడు. కాని నానుంచి వాడికి ముట్టినవిమాత్రం నిరాదరణా, చికాకూ, చీదరింపూ, హేళనా—ఇలాంటివి,

"అయిదోయేట వాణ్ని బడికి పంపాడునాన్న. వాడికి నాకు జరిగినట్లు వైభవంగా అక్షరాభ్యాసం లాంటివేమీ జరగలేదు. ఓ పలక కొనియిచ్చి బడికి వెళ్ళమన్నాడునాన్న. అలాగే వెళ్ళాడు వాడు. ఎదురుచెప్పలేదు. వాడు ఎదురు చెప్పి లాభమేమిటి—మరిన్ని దెబ్బలు తినటంతప్ప? అప్పుడేకాదు, ఏనాడూ వాడు 'నాకు ఫలానాది కొనిపెట్ట'మని అడగలేదు. తనవాళ్ళే తననిలా చీదరించుకుంటోంటే, ఎంత ఆవేదనను మనసులో అణచిపెట్టుకున్నాడో పాపం వాడు?


"నాన్నకు పేకాట పిచ్చి వుండేది ఇంటి గొడవల్లో ఆసక్తి తగ్గేకొద్దీ ఆ పిచ్చి ఎక్కువయింది. ఆయన రోజూ చిల్లర మార్చుకుని పేకాటకు వెళ్ళేవాడు. అలా వెళ్ళేటప్పుడు ఎప్పుడో బుద్ధిపుట్టి దయాధర్మంగా పావలానో, అర్ధరూపాయో వాసుకు ఇచ్చేవాడు. వాడు ఆ డబ్బుపెట్టి నోటుబుక్కులు తెచ్చుకునేవాడు. నోటు బుక్కులు తక్కువైతే చిత్తుకాయితాలూ, ఒకపక్క ఖాళీగావున్న సినిమా కాయితాలూ సంపాయించి బుక్కులు కుట్టుకునేవాడు. ఇంట్లో తన స్థానం తక్కువైనదని గుర్తించాడేమో, తన బట్టలు తానే ఉతుక్కునేవాడు. వాటిని మడతపెట్టి, వాడికిగాను మేము కేటాయించిన చెక్కపెట్టెలో దాచుకునేవాడు.

"నాన్నా, నేనూ అయితే వాసును వేరుగా చూశాము గాని, వాడు మాత్రం మమ్మల్ని అలా చూడలేదు. నాన్నను పూజ్యుడైన నాన్నగా గౌరవించాడు. అన్నగా నా స్థానాన్ని నాకూ ఇచ్చాడు. అంత పసివయస్సులోనే వాడికి అంత గొప్ప హృదయం, క్షమాగుణం ఎలా వచ్చాయా అనిపిస్తుంటుంది ఇప్పటికీ. ఈ భావన మరింతగా బాధపెడుతుంటుంది నన్ను. అప్పుడు వాడుకూడా నన్ను ఎదిరించివున్నా, పెద్దగా మాట్లాడి అగౌరవపరచివున్నా, అవమానించి వున్నా ఇప్పుడు నాకు ఇంత బాధ వుండేది కాదేమో!

"ప్రవర్తనతోబాటు చదువులో కూడా ఆదర్శంగా వుండేవాడు వాసు. వాడు ప్రతి క్లాసులోనూ ఫస్టు మార్కులు తెచ్చుకుని ప్యాసవుతోంటే, అంతకుముందు ప్రతి క్లాసూ రెండేళ్ళ వంతున చదివివున్న నేను అసూయతో వుడికిపోయేవాణ్ణి. అప్పటికే నేను ఇంటరు పరీక్షతో కుస్తీ పడుతున్నాను. మా యిద్దరిదీ లెక్కల గ్రూపే అవటం వల్ల, అప్పుడప్పుడూ వాసు ఏదేనా లెక్క అర్థమవలేదని తీసుకువచ్చి చెప్పమనేవాడు నన్ను. నేను విసుక్కునేవాణ్ని. వాస్తవానికి ఆ లెక్క నాకుకూడా తెలీకపోయినా, ఆపాటిలెక్క అర్థం కానందుకు వాసును తిట్టేవాణ్ని 'భోంచెయ్యటం మాత్రం చేతవు' నని హేళన చేసేవాణ్ని. అంతటితో నా మనస్సులోని అకారణ ద్వేషానికి తృప్తి కలక్కపోతే, వెళ్ళి నాన్నతో చెప్పేవాణ్ని. నాన్న వాణ్ని ఎందుకూ పనికిరానట్టు తిట్టి, అలాంటి మొద్దుగాళ్లు జీవించి వుండటం భూమికే బరువనేవాడు. ఆ వయసులోకూడా వాణ్ని కొట్టేవాడు. కన్న తండ్రి కొడుకును అలా కొట్టటం ఆశ్చర్యంగా వుందికదూ? ఇలాంటిది కథల్లోకూడా జరగదు కాని జీవితం కథలకన్నా చిత్రంగా వుంటుంది.

"వాసు ఇంటరు ప్యాసయ్యాడు. అప్పుడు మళ్ళీ పరీక్షకు కూచుని నేను తప్పాను. ఫలితాలు తెలిసినరోజున వాసుతోబాటు పేపరుపట్టుకుని వాడి స్నేహితులు మా యింటికివచ్చారు. ఆ స్నేహితుల్లో కొందరు, నేను ఏ తరహా మనిషినో తెలిసినవాళ్ళు, వాసు ప్యాసయినందుకు అసూయతో ఉడికిపోతున్న నన్ను హేళనగా చూశారు. నేను మరింత వుడికిపోయి, ఇది వాసూయే వాళ్ళచేత చేయించాడనుకున్నాను. అలా చేయించేటంత తక్కువతనం వాసులోలేదని నాకు తెలుసు. తెలిసీ వాణ్ని కొట్టాను. వెళ్ళి నాన్నతో చెప్పాను. నాన్న కూడా వాణ్ని నానామాటలన్నాడు.

"అలా తిట్లుతిన్న తరువాతే ఆ అమాయికుడు నాన్నను ఒక రూపాయి ఇమ్మని అడిగాడు.



"లౌ 'ఎట్ ఫస్ట్ సైట్' వల్ల ప్రయోజనమేమిటి?"
"ప్రయోజనమా! బోలెడంత టైమ్ కలిసొస్తుంది."

''ఎందుకు?'' అన్నాడు నాన్న, గద్దింపుగా.

"ఫ్రెండ్స్‌కు పార్టీ చేసుకుంటానన్నాడువాడు. అంతమంది ఫ్రెండ్స్‌కు పార్టీయివ్వటానికి రూపాయికి మించి అడగలేదువాడు. కాని, నాకైతే ఆ-ళాన పది రూపాయిలడిగినా జేబులోంచి తీసి అందించే నాన్న. వాడికా రూపాయి యివ్వలేదు. 'ఇప్పుడు పార్టీలు తక్కువ కాలేదులే!' అన్నాడు. వాడేమీ తర్కించలేదు, మౌనంగా వెళ్ళిపోయాడు.

''అప్పటికి వాసుకు పద్దెనిమిదేళ్ళు. అన్నట్టు మరచిపొయ్యాను. వాసు అందగాడు. వాడు పుట్టినప్పుడే ఆరు నెలల బిడ్డలాగా బొద్దుగా, తెల్లగా వుండటం చూసి ఇరుగు పొరుగువాళ్ళు వాణ్ని అదేపనిగా ముద్దాడేవాళ్ళు. కాలేజీలో చదువు తున్నప్పుడుకూడా చాలామంది ఆడపిల్లలు వాణ్ని తినేసేటట్టు చూస్తూ వుండటం, సువర్ణ అనే అమ్మాయి వాడికి ప్రేమలేఖరాయటం, నాకుతెలుసు. వాడి యీ అందంకూడా చిన్నప్పటినుంచీ నాలో యీర్ష్యను సృష్టించింది. వాడిపట్ల నాన్న చూపుతున్న నిరాదరణచూసి

సంతోషించే నేను. ఏ క్షణాన్నయినా వాడి అందం వాణ్ణి నాన్నకు సన్నిహితం చేస్తుందేమోనని భయపడ్డాను.

"ఇంటరు ప్యాసైనాక ప్రొఫెసర్లంతా వాసును బి. ఏ. చదవమన్నారు. వాడికి కూడా చదవాలని ఉబలాటం కలిగింది. వచ్చి నాన్న నడిగాడు. నాన్న ఒప్పుకో లేదు. చదివించనన్నాడు. 'నువ్వు కలెక్టరువై మమ్మల్ని ఉద్ధరించ నవసరం లేదులే_' అన్నాడు. అలా ఎందుకన్నాడో తెలియదు. సవతి తమ్ముడు కాబట్టి నేను వాసును ద్వేషించినా దానికి ఏదోవిధంగా అర్థంచెప్పుకోవచ్చు. తండ్రి అయివుండీ నాన్న వాణ్ణి అలా కంటగించుకోవటం చిత్రాతిచిత్రంగా కనిపిస్తుంది నాకు ... అప్పుడు కూడా వాసు పల్లెత్తు జవాబు చెప్పలేదు. వాడి స్నేహితులూ, ప్రొఫెసర్లూ కలిసి, 'మేము డబ్బిస్తాం. చదువు.' అంటే, 'మా నాన్న కిష్టంలేని పని నేను చెయ్యలేను.' అన్నాడట. మరి నాన్నా, నేనూ ఎప్పుడూ వాడికి ఇష్టమయిన పనులే చేశామా ?

"ఇవన్నీ ఒక యెత్తూ, వాసు ప్రేమ గాధ ఒక యెత్తూ. వాసుతోబాటు ఇంటరు చదువుతున్న సువర్ణ వాసును ప్రేమించింది. ప్రేమలేఖ రాసింది. ఇద్దరూ ప్రేమించుకున్నారు. సువర్ణకూడా వాడికి అన్నివిధాలా తగినట్లుండేది. ఆ ప్రేమ లతను అలాగే నీళ్ళుపెట్టి ఎదగనిచ్చి వుంటే ఇప్పటి కెన్ని పూలు పూచేదో! ఇదంతా గతజలసేతుబంధనం. అప్పుడు మాత్రం ఏ ఆలోచనా లేకుండా వాళ్ళ ప్రేమను నలిపివేశాము. వాసు సువర్ణను పెళ్ళి చేసుకుంటానంటే నాన్న ఒప్పుకో లేదు. సువర్ణను చేసుకునే పక్షంలో తనతో సంబంధం తెంచుకోమన్నాడు. అంతవరకూ లేని సంబంధాలూ, ఆశలూ ఆ సమయంలో కనిపించాయేమో నాన్నకు !

"ఇందుకుకూడా వాసు తలవంచాడు. అప్పటిదాకా పెంచుకున్న ప్రేమను వదులుకున్నాడు. తనకు తండ్రి మీద వున్న గౌరవానికి ప్రేమను పణంగా పెట్టాడు. ఆరోజునుంచీ సువర్ణను కలుసుకోలేదు. ఇలా జరుగుతుందని కలలోనైనా అనుకోని సువర్ణ కుప్పకూలి పోయింది. క్షోభించింది. ఏడ్చింది. తమను అన్యాయం చెయ్యవద్దని నాన్నను ప్రాధేయపడింది. నాన్న వినలేదు. సువర్ణ తల్లిదండ్రులు, తోటి విద్యార్థినులు, వాసు స్నేహితులు చెప్పి చూశారు, కాని నాన్న మనస్సు కరగలేదు. ఇక యిది పనికాదని, సువర్ణ ఒకనాటి రాత్రి వాసును కలుసుకుని, ఇద్దరూ ఎక్కడికేనా వెళ్ళిపోయి బ్రతుకుదామని చెప్పింది. అందుకు వాసు ఒప్పుకోలేదు. ఈ భగ్న ప్రేమ శోకాన్ని సహించలేక, ఆ తరువాత

కొన్ని నెలలకే సువర్ణ మంచం పట్టి కన్ను మూసింది.

"ఇది వాసు జీవితంలో ఒకమలుపు. నిజంగా ఇక్కడ వాసు తప్పు చేశాడేమో! వాడిక్షమాగుణమే, మితిలేని వాడి మంచితనమే వాణ్ని పొట్టబెట్టుకుంది. లేకపోతే, అప్పటిదాకా వాణ్ని అన్ని విధాలా నిర్లక్ష్యంచేసి కంటగించుకున్న నాన్నమాటను లెక్క చెయ్యవలసిన అగత్యం వాడికేమిటి? నాన్ననుధిక్కరించి వాడు దూరంగాపోయి సువర్ణను పెళ్ళిచేసుకునివున్నా వాడిబ్రతుకిలావిషాదాంతం కాకపోను! వాడి విషాధగాథ మా గుండెల్లో యిలా ఆరని చిచ్చు పెట్టివుండకపోను!

"నాన్నమాటను పాటించి ప్రేమను వదులుకున్నా. ఆ హృదయ భారాన్ని ఎక్కువరోజులు సహించలేకపోయాడు వాసు. ఒకవేపుభగ్నప్రేమ, ఆత్మీయుల నిరాదరణ, మరోవేపు సువర్ణ అకాల మరణం వాణ్ని దాదాపు పిచ్చి వాణ్నిగా చేశాయి. ఇక మనసు నిలువదొక్కుకోలేక, వాడొకరోజున ఎవ్వరికీచెప్పకుండా యింట్లోంచి వెళ్ళిపోయాడు. అంతే. పోయినవాడు తిరిగిరాలేదు. మళ్లీ యీనాడు తిరిగి వచ్చినట్టే వచ్చి, మినుక్కుమని మెరిసి, శాశ్వతంగా దూరమై పోయాడు."

చెప్పటం పూర్తిచేశాడుగోపాలరావు. కథకు ఇంకా ఏదో అతుకు వుందనీ, ఆయన ఇంకా చెబుతాడనీ ఎదురు చూస్తోందిలక్ష్మి. మళ్లీ, అలాంటిఅతుకు అవసరం లేదని అనిపిస్తోంది ఆమెకు.

ఆయన యింకేమీచెప్పలేదు. అంతకు మించిఆయనను అడుగుదామన్న ధైర్యం చాలలేదు లక్ష్మికి. ఎందుకంటే, యిది దుఃఖానికి ఉచ్ఛశద. ఈ స్థితిలో మనుషుల ఆవేశాలూ, ఉద్వేగాలూ ఉచ్ఛస్థితిలో వుంటాయి. అవి శరన్మేఘాలు. చల్లగాలిలా ఆత్మీయుల పలకరింపు తగిలితే భొళ్లున వర్షిస్తాయి. ఆ వర్షం ఉధృతంగా వుంటుంది.

